క్లుప్తంగా

ప్రత్తిపాడులో ఒకరు... పొన్నూరులో ఇద్దరు

పొన్నూరు: పొన్నూరు నియోజకవర్గం నుంచి శుక్రవారం ఇద్దరు అభ్యర్థులు నామినేషన్లు వేశారు. బహుజన సమాజ్ పార్టీ తరఫున యాతాటి కిశోర్ నామపత్రాలు దాఖలు చేశారు. కాగా స్వతంత్ర అభ్యర్థిగా దొప్పలపూడి వాసు దేవరావు అభ్యర్థిత్వ పత్రాలను అందించారని రిటర్నింగ్ అధికారి లక్ష్మీకుమారి తెలిపారు.

ప్రత్తిపాడు: నామినేషన్ల పర్వంలో భాగంగా శుక్రవారం కేవలం ఒక్కరే అభ్యర్థిత్వ పత్రాలను దాఖలు చేశారు. పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా ప్రత్తిపాడు మండలం కొండేపాడుకు చెందిన శరత్‌కుమార్ చల్లా నామినేషన్ వేశారు. స్థానిక రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి ప్రతిపాదకులతో కలిసి వెళ్లి పత్రాలను ఆర్వో పి. శ్రీకర్‌కు అందజేశారు. ఈనెల 18న నామినేషన్ పర్వం ప్రారంభమవగా తొలిరోజు భారత చైతన్య యువజన పార్టీ తరఫున ఎస్ స్తోత్రరాణి ఒక్కరే తమ అభ్యర్థిత్వ పత్రాలను అందించారు. కాగా రెండో రోజు సైతం ఒకే ఒక్కటి దాఖలవడం విశేషం. ప్రధాన పార్టీల అభ్యర్థులు సెంటిమెంట్ కోసం వేచిచూస్తున్నారు. ఈ నేపథ్యంలో రిటర్నింగ్ కార్యాలయ ఆవరణలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

తాడికొండ టీడీపీ అభ్యర్థిగా తెనాలి శ్రావణ్ నామినేషన్

నిబంధనలకు నీళ్లొదులుతూ..

తాడికొండ: తాడికొండ తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా తెనాలి శ్రావణ్ కుమార్ శుక్రవారం నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఉదయం తాడికొండ అడ్డరోడ్డు నుంచి ర్యాలీగా తరలివచ్చారు. ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కంతేటి బ్రహ్మయ్యల చేతుల మీదుగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం గంగరాజుకు నామపత్రాలు అందజేశారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కాగా నామినేషన్ ప్రక్రియలో అడుగడుగునా నిబంధనల ఉల్లంఘన కనిపించింది. టీడీపీ, జనసేన జెండాలు పెట్టుకొని వాహనాలతో ర్యాలీగా వెళ్ళడంతో పాటు మద్యం పంపిణీ జోరుగా జరిగింది. వాహనాలపై వచ్చిన యువతకు పెట్రోల్ పోయించడంతో పాటు బిర్యానీ పంపిణీ చేశారు.

ఎన్నికల ప్రలోభాలపై అప్రమత్తంగా ఉండాలి

లక్ష్మీపురం: లోక్ సభకు, అసెంబ్లీకి ఏక కాలంలో ఎన్నికలు జరగుతున్న ఈ సమయంలో ప్రలోభాలతో మభ్యపెడుతున్న పార్టీలపై ఓటర్లు అప్రమత్తంగా ఉండాలని సీమాంధ్ర మేధావుల ఫోరం కన్వీనర్ పి.ఎస్.మూర్తి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన చర్చ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సంస్థ సభ్యులు, సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

22 లోపు పోస్టల్ బ్యాలెట్ వివరాలు అందజేయాలి

నెహ్రూనగర్: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో ఓటు ఉండి ఎన్నికల విధులకు ఎంపికైన అధికారులు, సిబ్బంది ఈ నెల 22వ తేదీ లోపు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ కౌంటర్‌లో వివరాలు ఇవ్వాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరి, పశ్చిమ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కె.రాజ్యలక్ష్మి శుక్రవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గంలో ఓటు కలిగి ఉండి 2024 సాధారణ ఎన్నికల ప్రక్రియలో విధులకు ఎంపికైన మాస్టర్ ట్రైనర్లు, బీఎల్‌ఓలు, సెక్టార్ అధికారులు, రూట్ అధికారులు, ఇతర సిబ్బంది, వీడియోగ్రాఫర్స్, డ్రైవర్లు పోస్టల్ బ్యాలెట్ హెల్ప్‌డెస్క్‌లో ఫారం-12(2 కాపీలు) అందించాలని తెలిపారు. ఫారం-12తో పాటుగా ఓటర్ ఎపిక్ కార్డ్, డ్యూటీ ఆర్డర్ కాపీ ఇవ్వాలన్నారు. హెల్ప్ డెస్క్ సిబ్బంది కార్యాలయ పని వేళల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధుల్లో ఉంటారని తెలిపారు.

ఓటు హక్కును తప్పక వినియోగించాలి

తెనాలి: సార్వత్రిక ఎన్నికల్లో ఓటుహక్కు కలిగిన ప్రతివారు తప్పనిసరిగా ఓటు చేయాలని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ముంబయి) కోస్తాంధ్ర అధ్యక్షుడు పల్నాటి నాగరాజు సూచించారు. స్థానిక 11వ వార్డులోని పూలే కాలనీలో కౌన్సిల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్నికలు, ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. ప్రజలు తమ ఓటు హక్కును ప్రజల కోసం పరిపాలన చేసే ప్రభుత్వాలు, నాయకులను ఎన్నుకోవటానికి ఉపయోగించాలని కోరారు. కౌన్సిల్ సభ్యులు ఎం.లిఖిత్, జె.శివశ్యాం, కె.ఫణికుమార్, శ్రీను, ఏసుపాదం, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని గాంధీబొమ్మ సెంటర్లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. సంఘ నాయకులు మాట్లాడుతూ వేసవిలో ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు చలివేంద్రం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. ప్రతి రోజు పరిశుభ్రమైన మంచి నీరు తమ సంఘం ద్వారా ప్రజలకు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు దాచేపల్లి నరేంద్రకుమార్, కొత్త మాసు వెంకటేశ్వర్లు, గుగ్గిళం మధుసూదనరావు, కె.పున్నారావు, డి.సాయి, డి. శ్రీనివాస్, ఎ.కోటేశ్వరరావు, ఎస్.విష్ణుకిరణ్‌లున్నారు.

వీలు దొరికితే చాలు..యాగీ చేస్తారు వాళ్లు

- నీళ్ల కోసం రోడ్డుపై బైఠాయించిన ప్రత్తిపాడు రామానగర్ కాలనీ వాసులు
- ఏమీ తెలియనట్లు ప్రత్యక్షమైన టీడీపీ నేతలు
- మేమిస్తామంటూ హడావుడి


ప్రత్తిపాడులో రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న రామానగర్ కాలనీ వాసులు

ప్రత్తిపాడు: ఎక్కడ ఏ చిన్న ఘటన జరిగితే చాలు, ఓటు బ్యాంకుగా మలచుకోవాలనే ఆత్రంలో ఉన్నారు టీడీపీ నాయకులు. ప్రజల మెప్పు కోసం వారు పడుతున్న పాట్లను చూసి ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. ప్రజలకు చేరువ కావాలనే తాపత్రయంలో, రెచ్చగొట్టి తమ ప్రచార యావ తీర్చుకునే పనిలో తలమునకలవు తున్నారు. తాగునీటి సమస్యను తీర్చాలంటూ ప్రత్తిపాడు రామానగర్ కాలనీ వాసులు రోడ్డుపై బైఠాయించిన ఘటనను రాజకీయం చేసిన తీరే ఇందుకు అద్దం పడుతోంది.

తాగునీటి ఎద్దడి తీర్చే క్రమంలో...

ప్రత్తిపాడులో వేసవికి ముందే తాగునీటి సమస్య తలెత్తింది. ఈలోగా ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రభుత్వం ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేసింది. ఇంతలో రాష్ట్ర ప్రభుత్వం సాగర్ జలాలను విడుదల చేసింది. ప్రస్తుతం సాగర్ జలాలను పలు మండలాల చెరువుల్లోకి యుద్ధ ప్రాతిపదికన తరలిస్తున్నారు. అయితే సరఫరాలో కొంత అంతరాయం ఏర్పడటంతో పరిష్కరించాలంటూ ఇప్పటికే ప్రజలు రాస్తారోకో చేపట్టారు. దీంతో ఎట్టకేలకు చెరువుకు సాగర్ జలాలు ప్రత్తిపాడు చెరువుకు చేరుతున్నాయి. చెరువులు పూర్తిగా నిండిన తరువాత గ్రామంలోకి యదావిధిగా తాగునీటిని సరఫరా చేసేందుకు పంచాయతీ అధికారులు ప్రణాళికలు


ఆందోళన విరమణానంతరం కాలనీ వాసులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

సిద్ధం చేసుకుంటున్నారు. మరో రెండు మూడు రోజుల్లో నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ఇంతలోనే టీడీపీ ఓవరాక్షన్

మరో రెండు రోజులాగితే తాగునీరు స్థానికులకందుతుంది. సమస్య పరిష్కారమైతే తమ ప్రచారానికి ఉన్న ఒక్క అవకాశం కూడా చేజారిపోతుందనుకున్నారో ఏమో..నానాయాగీ చేసేందుకు సిద్ధమయ్యారు. తమ ప్రాపకం కోసం ప్రజలను రెచ్చగొట్టారు. శుక్రవారం సాయంత్రం ప్రత్తిపాడు శివారులోని రామానగర్ కాలనీ వాసులను పోగుచేసి ఖాళీ బిందెలతో స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదుట బైఠాయించేలా ప్రణాళిక రచించారు. అనుకున్న ప్రకారం సాయంత్రం ఓ పదిహేను మంది మహిళలను ఖాళీ బిందెలతో రోడ్డుపై కూర్చోబెట్టారు. ఇదంతా టీడీపీ వాళ్లు తమ స్వార్థంతో, రాజకీయ ప్రయోజనాల కోసం చేస్తున్నారని తెలియని, స్థానిక మహిళలు నీళ్లు కావాలంటూ నినదించారు. అప్పటికే అక్కడ ఉన్న ఆ పార్టీ జిల్లా తెలుగుయువత అధ్యక్షుడు రాయపాటి సాయికృష్ణ తన ఫోనులో ఫోటోలు, వీడియోలు తీస్తూ తనదైన శైలిలో ప్రచారానికి పనిచెప్పాడు. అంతటితో ఆగకుండా వాళ్లు నీళ్లు ఇవ్వకపోతే.. మేమిస్తామంటూ మద్దతుగా మాట్లాడారు. పది నిమిషాల్లోనే పోలీసులు అక్కడికి చేరుకుని, కాలనీకి నీళ్లు వచ్చేలా అధికారులతో మాట్లాడతామని చెప్పడంతో కాలనీవాసులు వెళ్లిపోయారు. విచిత్రమేమిటంటే..గుంటూరు నుంచి జిల్లా స్థాయి నాయకులు రామానగర్ కు అదే సమయానికి రావడం. ఈ తంతును చూస్తుంటే అంతా కూడబలుక్కుని చేసిన వ్యవహారమేనన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇకనైనా ఇలాంటి ఓటు బ్యాంకు దుమారాలకు టీడీపీ మానుకోకపోతే రానున్న ఎన్నికల్లో మరింత ఘోరంగా దెబ్బతినకతప్పదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

జయం..జయం..కిలారి రోశయ్య

- వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థికి అండగా అభిమానులు, కార్యకర్తలు
- శుభాకాంక్షలు తెలిపిన పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: గుంటూరు పార్లమెంటు స్థానానికి వైఎస్సార్ సీపీ తరఫున అభ్యర్థిగా కిలారి వెంకట రోశయ్య నామినేషన్ శుక్రవారం అంగరంగ వైభవంగా సాగింది. ఈ మేరకు ఆయన అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ పార్టీకి చెందిన అగ్రనేతలు అండగా నిలిచారు. ఇందులో భాగంగా పొన్నూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలతో తరలివెళ్లారు. పట్టణంతో పాటు, గ్రామాలనుంచి బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాలతో రోశయ్య వెంట ర్యాలీగా వెళ్లి కిలారి రోశయ్యకు ఘనస్వాగతం పలికారు. అభినందనలతో ముంచెత్తారు. విజయ తిలకం దిద్ది నామపత్రాలను దాఖలు చేసేందుకు రిటర్నింగ్ కార్యాలయానికి పంపించారు.


రోశయ్య నామినేషన్‌లో పాల్గొన్న పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ

మంచాలలో అతిసార..అప్రమత్తమైన యంత్రాంగం

- స్కూల్‌లో మెడికల్ క్యాంపు ఏర్పాటు
- పరిశీలించిన జిల్లా కలెక్టర్

మంచాల(చేబ్రోలు): చేబ్రోలు మండలం మంచాలలో అతిసారం ప్రబలింది. వాంతులు, విరేచనాలతో బాధపడుతున్న వారిలో కొందరు స్థానికంగా ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో చికిత్స పొందుతున్నారు. ఇంకొందరు చేబ్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స తీసుకుంటున్నారు శ్రీరామనవమి సందర్భంగా తయారుచేసిన పానకాన్ని రెండు రోజులుగా తాగటం వల్ల అతిసార వ్యాధి ప్రబలినట్లు వైద్యులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. తహసీల్దారు రమాదేవి, ఎంపీడీవో కే జ్యోతి, వైద్యాధికారి అబ్రహం లింకన్‌లు గ్రామంలో పర్యటించి తగు జాగ్రత్తలు చేపడుతున్నారు. గ్రామ సచివాలయావరణలో శిబిరాలు, తాత్కలిక బెడ్లను ఏర్పాటు చేసి అవసరమైన వారికి వైద్య సేవలు అందిస్తున్నారు.

బాధితులను పరామర్శించిన జిల్లా కలెక్టర్

మంచాల గ్రామంలో పరిస్థితిని తెలుసుకున్న జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాలరెడ్డి శుక్రవారం రాత్రి పరిశీలించారు. ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి ,, పానకం నమూనాలను ల్యాబ్‌కు పంపి పలితాలను తెలియజేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నిరంతర సేవలందించాలని వైద్యసిబ్బందిని సూచించారు. కలెక్టర్ వెంట తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్, అదనపు డీఎంహెచ్‌వో అన్నపూర్ణమ్మ, ఎంపీడీవో కె జ్యోతి, తహసీల్దారు రమాదేవి, చేబ్రోలు వైద్యాధికారి అబ్రహం లింకన్, ఆర్‌డీ శోబారాణి, పంచాయతీ కార్యదర్శి జి శ్రీనివాసరావు తదితరులు హాజరయ్యారు.


మంచాలలో బాధితులతో జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాలరెడ్డి, ఇతర అధికారులు


స్థానిక యూపీ పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్యశిబిరం

అందరినీ పలకరిస్తూ..ఆదరించమని అభ్యర్థిస్తూ..

- ప్రజల్లోకి ప్రత్తిపాడు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని
- నాగారమ్మతల్లి కొలుపుల్లో సందడిగా..

గుంటూరు రూరల్: ఏమ్మా ..ఈ ఐదేళ్ల పాలన ఎలా ఉంది? పథకాలు అందాయా? మీ కుటుంబంలో ఏమేర పురోగతి కనిపించింది? గతంతో పోల్చిచూస్తే మార్పేమైనా కనిపిస్తోందా? గత పాలనతో బేరీజు వేసుకోండి. మీ బతుకుల్లో మేటి మార్పు కనిపించినట్లయితే మమ్మల్ని ఆశీర్వదించండి. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి మరోసారి వై జగన్ మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేయండి...ఇవీ ప్రత్తిపాడు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్ కుమార్ ప్రచారశైలి. ఎన్నికల వేడి ఊపందుకున్న వేళ, నామినేషన్ల పర్వం ఆరంభమైన తరుణాన బలసాని తన ప్రచారానికి పదునెక్కించారు. ప్రజల్లోకి దూసుకుపోతున్నారు. అన్ని వర్గాలవారిని పలకరిస్తూ కుశల ప్రశ్నలు అడుగుతున్నారు. తమ జీవితాల్లో చోటుచేసుకున్న పురోగతిని అడిగి తెలుసుకుంటున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం మండలంలోని లాలుపురం పంచాయతీ లింగాయపాలెం ప్రజలను కలిశారు.స్థానికులతో ముచ్చటించారు. యోగక్షేమాలనడిగి తెలుసుకున్నారు. జగనన్న పాలనలో తామంతా సంతోషంగా ఉన్నామని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుంటామని మాటివ్వడంతో ఆయన ఆనందం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ విజయానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని బలసాని కిరణ్ కుమార్ పిలుపునిచ్చారు.


ఓ వృద్ధునితో చేతిలో చెయ్యేస్తూ ..పలకరిస్తోన్న ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని

నాగారమ్మతల్లి కొలుపుల వేడుకల్లో బలసాని

అంతకుముందు లింగాయపాలెం గ్రామంలో జరుగుతున్న నాగారమ్మతల్లి కొలుపుల వేడుకల్లో ప్రత్తిపాడు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు. ప్రజలందరికీ గ్రామదేవత ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు.

అతిసార బాధితులను పరామర్శించిన అంబటి మురళీకృష్ణ

మంచాల(చేబ్రోలు): మంచాలలో అతిసార బాధితులను వైఎస్సార్‌సీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ శుక్రవారం పరామర్శించారు. స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో చికిత్స పొందుతున్న వారిని ఆయన కలిశారు. గుంటూరు జీజీహెచ్, చేబ్రోలు పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను సూచించారు.


బాధితుల పరిస్థితిపై వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ

వలంటీర్ల రాజీనామాల వెల్లువ


పెదనందిపాడులో ఎంపీడీఓ సునీత శర్మకు రాజీనామాలను అందజేస్తున్న వలంటీర్లు


కాకుమానులో పంచాయతీ కార్యదర్శి పూర్ణయ్యకు రాజీనామాలను సమర్పిస్తున్న దృశ్యం

- కాకుమాను నుంచి 32 మంది
- పెదనందిపాడు నుంచి 23 మంది
- కూటమినేతల మాటలపై మండిపాటు

కాకుమాను: ప్రత్తిపాడు నియోజకవర్గంలో రోజురోజుకూ వలంటీర్ల రాజీనామాల వెల్లువ కొనసాగుతూనే ఉంది. స్వచ్ఛందంగా ముందుకొచ్చి మూకుమ్మడిగా తమ సేవలకు స్వస్తి చెబుతున్నారు. కాకుమాను, పెదనందిపాడు మండలాల్లో వలంటీర్లు శుక్రవారం తమ రాజీనామాలను సంబంధిత అధికారులకు అందజేశారు. పెదనందిపాడు మండలం అన్నవరం నుంచి 10 మంది, నాగులపాడు నుంచి ఆరుగురు, పెదనందిపాడు నుంచి ఏడుగురు సేవలనుంచి తప్పుకుంటున్నట్లు ఎంపీడీఓ సునీత శర్మకు పత్రాలను అందజేశారు. కాకుమాను మండలం విషయానికి వస్తే..ఒక్క కాకుమాను ప్రధాన కేంద్రం నుంచి 32 మంది సేవకులు కార్యదర్శి పూర్ణయ్యకు తమ రాజీనామాలను అందజేశారు.

పల్లె పల్లెన దళిత ఘీంకారం సమావేశాలు

నెహ్రూనగర్: దళిత సమాజం ఎదుర్కొంటున్న కొన్ని సంఘటనలపై పల్లె పల్లెన దళిత ఘీంకార చైతన్య సమావేశాలు డిసెంబర్ వరకు నిర్వహించనున్నట్లు భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు పాగళ్ల ప్రకాష్ పేర్కొన్నారు. శుక్రవారం అరండల్‌పేటలో భీమ్ భారత్ కార్యాలయంలో చైతన్య సమావేశాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో ప్రస్తుతం దళిత గిరిజనులకు కల్పిస్తున్న రిజర్వేషన్ల విధానం అనేది ఒక తాత్కాలిక ఉపశమనంగానే పరిగణించాల్సిన అవసరం ఉందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిన్నతనం నుంచే అంటరాని తనాన్ని అనుభవించి భావితరాల వారు తాను అనుభవించిన వివక్ష అనుభవించకూడదనే ఉద్దేశంతో విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు తీసుకువచ్చారన్నారు. రిజర్వేషన్ల ఫలాలు అనుభవించిన వారు తిరిగి సమాజానికి మేలు చేయకపోగా రాజకీయ పార్టీలకు కొమ్ముకాస్తున్నారని మండిపడ్డారు. అణగారిన వర్గాల అభ్యున్నతి, అభివృద్ధే ధ్యేయంగా పల్లె పల్లెన చైతన్య సమావేశాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. సంఘ నాయకులు రాజేంద్రప్రసాద్, కమల్‌కుమారి, మామిడి సునీల్, తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాల తనిఖీ

ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడులోని ఎంపీపీఎస్ ఉర్దూ పాఠశాలను ఎంఈఓ మహబూబ్‌సుభాని శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి తగిన సూచనలు ఇచ్చారు. ఎంఈఓ మాట్లాడుతూ వేసవి ఎండలు తీవ్రంగా ఉండటంతో పిల్లలకు గంటగంటకు తాగునీరు అందించేలా చూడాలని చెప్పారు. ఈనెల 23లోగా పరీక్షలకు సంబంధించిన పేపర్లు మార్కుల జాబితాలు సిద్ధం చేయాలని హెచ్ఎంలను కోరారు. 24 నుంచి వేసవి సెలవులు ఇస్తుండటంతో విద్యార్థులకు వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఆయన వెంట పాఠశాల హెచ్ఎం కృష్ణాలీఫాతిమా ఉన్నారు.

నల్లపాడు కేంద్రియలో ప్రేరణ ఉత్సవం

గుంటూరు రూరల్ : గుజరాత్ రాష్ట్రం వాడ్‌నగర్ వెర్నాక్యులర్ పాఠశాలలో జరగబోయే ప్రేరణ కార్యక్రమంలో పాల్గొనే విద్యార్థుల తుది ఎంపిక జరగనుందని జిల్లా విద్యాశాఖాధికారి పి.వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం నల్లపాడులోని పీఎం కేంద్రీయ విద్యాలయంలో 2024 జిల్లా స్థాయి ప్రేరణ ఉత్సవాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈఓ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భారత దేశం నా విజన్ , వికసిత్ భారత్, ప్రేరణ ఉత్సవానికి విద్యార్థులను ఎందుకు ఎంపిక చేయాలనే అంశాలపై విద్యార్థులకు వ్యాస రచన, కవిత, చిత్రలేఖన ప్రదర్శించేలా ప్రోత్సహించడం జరిగిందన్నారు. ఈ ప్రేరణ ఉత్సవంలో జిల్లా వ్యాప్తంగా 60 పాఠశాలల నుంచి ఒక్కో పాఠశాలకు బాలుడు, బాలిక చొప్పున 120 మంది పాల్గొన్నారని తెలిపారు. వీరి నిష్పాదన మూల్యంకన అనంతరం వ్యక్తిగత ఇంటర్వ్యూలు, మార్కుల ఆధారంగా 30 మందిని ఎంపిక చేస్తామన్నారు.ఎంపికైనవారి వివరాలను ప్రేరణ పోర్టల్‌లో అప్‌లోడు చేస్తామని డీఈఓ వివరించారు.

కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు ప్రసన్న, టి.ఎస్.సునీల, ఆనంద్, విద్యార్థులు పాల్గొన్నారు.


ప్రేరణ ఉత్సవాన్ని నిర్వహిస్తున్న అధ్యాపకులు

కొనసాగుతున్న అగ్నిమాపక వారోత్సవాలు

పలు ఆస్పత్రుల్లో ప్రమాదాల నివారణపై అవగాహన

లక్ష్మీపురం: గుంటూరు నగరంలోని పలు ప్రధాన కూడళ్లు, వ్యాపారసంస్థలు, విద్యాసంస్థలతో పాటు ఆసుపత్రులలో కూడా అగ్ని ప్రమాదాల నివారణ పై అవగాహన కల్పించడం జరిగిందని అగ్నిమాపక కేంద్రం గుంటూరు-2 పి.శ్రీనివాసరావు అన్నారు. నగరంలో శుక్రవారం ఆరోరోజు అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా అగ్నిమాపక కేంద్రం గుంటూరు-1 నుంచి ర్యాలీగా బయలుదేరి కాకాని రోడ్డులోని ఓమెగా, ఉదయ్ ఆసుపత్రులలో అగ్నిప్రమాదాలు, వాటి నివారణ చర్యల గురించి అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముందుగా ఆయా ప్రాంతాలలో ప్రమాదాలు సంభవించినప్పుడు అగ్నిమాపక వాహనాలు, సిబ్బంది అందుబాటులోకి వచ్చే లోగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలు గురించి వివరించారు. ప్రమాదం సంభవించిన సమయంలో గ్యాస్ సిలిండర్ పై మంటలు వచ్చే సమయంలో ఎలాంటి చర్యలు తీసుకోవాలో వివరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి తీవ్రత పెరగుతున్న నేపథ్యంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్స్, గ్యాస్ లీకేజీ వంటి ప్రమాదాలు సంభవించే ప్రమాదముందని, వీటి ద్వారా అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే ముందుగా అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో పాటు ప్రమాదం తీవ్రత కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా తెలిపారు. అనంతరం అగ్ని నివారణ పరికరాలైన హోజ్ రీల్ హోజ్, హైడ్రెంట్లును ఉపయోగించి ఎలా ప్రమాదాలు నివారించాలో ప్రదర్శన ద్వారా స్థానికులకు తెలియజేశారు. తొలుత నగరంలో బైక్ ర్యాలీ ద్వారా అవగాహన కల్పించారు. ఆయా ఆసుపత్రి సిబ్బంది, స్థానికులు, అగ్నిమాపక శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఆసుపత్రి సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది

రంగస్థల వేదికపై అలరించనున్న 'మట్టి మనిషి'

- 24న హైదరాబాద్ రవీంద్రభారతిలో ప్రదర్శన

తెనాలి: పొన్నూరు సమీపంలోని చేబ్రోలుకు చెందిన సుప్రసిద్ధ రచయిత డాక్టర్ వాసిరెడ్డి సీతాదేవి నవల 'మట్టిమనిషి' రంగస్థల నాటకంగా ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ప్రముఖ నాటక సంస్థ నిభా థియేటర్ ఎన్సెంబుల్ ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీ సాయంత్రం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఈ నాటికను ప్రదర్శించనున్నారు. తెనాలి నాటక రచయిత వల్లూరు శివప్రసాద్ ఈ నవలను నాటకీకరించగా, సుప్రసిద్ధ రంగస్థల నటి, దర్శకురాలు నస్రీన్ ఇషాక్ దర్శకత్వంలో ప్రదర్శనకు సిద్ధమైంది. డాక్టర్ వాసిరెడ్డి సీతాదేవి మెమోరియల్ ఫౌండేషన్ సహకారం అందిస్తోంది. 1970లో 'మట్టిమనిషి' నవల ఓ దినపత్రికలో ఆదివారం అనుబంధంలో సీరియల్‌గా ప్రచురితమైంది. 1972లో ప్రచురితమైంది. 1995-2000లో ఉస్మానియా యూనివర్శిటీ ఎంఏ ఫైనల్ విద్యార్థులకు పాఠ్యాంశంగా ఎంపిక చేసింది. నేషనల్ బుక్‌ట్రస్ట్ ఆఫ్ ఇండియా 14 భారతీయ భాషల్లోకి అనువదించి ప్రచురింపజేశారు. 'మాస్టర్ పీసెస్ ఆఫ్ ఇండియన్ లిటరేచర్' అనే కాలమ్‌లో ప్రస్తావించిన నన్నయ నుంచి నేటి వరకు వెయ్యేళ్ల తెలుగు సాహిత్యంలో వచ్చిన గొప్ప రచనల్లో 'మట్టిమనిషి' నవలను 13వ రచనగా పేర్కొన్నారు.


మట్టిమనిషి నవల

నూతనోత్తేజం నస్రీన్ ఇషాక్

నాటక దర్శకురాలు నస్రీన్ ఇషాక్‌కు 20 ఏళ్లకు పైగా అనుభవముంది. ఢిల్లీలోని నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా (ఎన్ఎస్‌డీ)లో గ్రాడ్యుయేషన్ చేశారు. నటిగా సుప్రసిద్ధ దేశ, విదేశీ నాటకరంగ దర్శకులతో పనిచేశారు. ఎన్ఎస్‌డీలో నటిగా ఏడేళ్ల అనుభవం. వివిధ సంస్థల్లో చలనచిత్ర అధ్యాపకురాలిగా, డబ్బింగ్ కళాకారిణిగా, కాస్ట్యూమ్ డిజైనర్‌గా, థియేటర్ ఆర్ట్స్ అధ్యాపకురాలిగా, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ గెస్ట్ లెక్చరర్‌గా చేశారు. హైదరాబాద్‌లోని 'సమాహార' అనే సంస్థ సహచర్యంతో తన సొంత గ్రూప్ 'నిభా థియేటర్ ఎన్సెంబుల్'తో 2016 నుంచి నాటకాలకు దర్శకత్వం వహిస్తున్నారు. పలు విదేశీ నాటకాలను హిందీలోకి అనువదించారు. చలం రచించిన 'మైదానం' నవలను రంగస్థలంపైకి తీసుకురావటం గొప్ప ప్రయోగం. జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత రావూరి భరద్వాజ 'పాకుడురాళ్లు' నవలను అదే పేరుతో నాటకంగా తీసుకొచ్చారు. మళ్లీ ఇప్పుడు వాసిరెడ్డి సీతాదేవి నవల 'మట్టిమనిషి' నాటకంగా జనంలోకి వస్తోంది.

సర్దార్ గౌతు లచ్చన్న బహుజనవాది

పెదకాకాని: పెదకాకాని గౌడపాలెం సర్దార్ గౌతు లచ్చన్న భవన్‌లో శుక్రవారం గౌతు లచ్చన్న 18వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి గౌడ ఉద్యోగ సంఘాల జిల్లా అధ్యక్షులు బొర్రా అంకయ్య అధ్యక్షత వహించారు.

రాష్ట్ర బీసీ నాయకుడు కుక్కల రామ్ ప్రసాద్ లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్దార్ గౌతులచ్చన్న బహుజనవాది అని కొనియాడారు. ప్రజా సమస్యలపై ముఖ్యంగా కార్మిక,కర్షక, అంటరాని తనానికి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలను నడపడంతో పాటు వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి తన జీవితాన్ని ధారపోసిన సౌమ్య శీలుడు లచ్చన్న అని శ్లాఘించారు. కార్యక్రమంలో డాక్టర్ ఉప్పాల శివాజీ, క్రోసూరు పూర్ణచంద్రరావు, కుక్కల మల్లేశ్వరరావు, కారంకి వెంకటేశ్వరరావు, పాగోలు శ్రీనివాసరావు, పాగోలు శివనాగమల్లేశ్వరరావు, పాగోలు రాము, కుక్కల శివ నాగ గోపి, శ్రీనివాసరావు, తుళ్లూరు నరసింహారావు, వడ్లమూడి నాగరాజు , పాగోలు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి సంస్కృత భాష శిక్షణ తరగతులు

తెనాలిఅర్బన్: కోట లక్ష్మయ్యనాయుడు సంస్కృత కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో శ్రీ వైఖానస సేవా సంఘం తెనాలి వారి సహకారంతో ఈ నెల 25 నుంచి గంగానమ్మపేటలోని శ్రీ వేణుగోపాలస్వామి వారి దేవస్థానంలో సంస్కృత భాషా ప్రవేశ ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. వేణుగోపాలస్వామి దేవస్థానం ఆవరణలో శుక్రవారం శిక్షణ తరగతులకు సంబంధించిన కరపత్రాలను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రముఖ ధార్మిక ప్రచారకులు డాక్టర్ డీఎస్ దీక్షితులు, దేవదాయ శాఖ కార్యనిర్వహణాధికారి మల్లీశ్వరిలు తరగతులను ప్రారంభిస్తారని చెప్పారు. ప్రతి రోజు సాయంత్రం 4 గంటల నుంచి 5.30 గంటల వరకు శిక్షణ తరగతులు జరుగుతాయని చెప్పారు. సూరేపల్లి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, ప్రముఖ సంస్కృత పండితులు బ్రహ్మశ్రీ కుచిబట్ల శ్రీనివాసశర్మ శిక్షణ ఇస్తారన్నారు. తెనాలి పట్టణం, పరిసర గ్రామాల్లోని పెద్దలు, పిల్లలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డి.మురళీకృష్ణ, మేడూరి శ్రీనివాసమూర్తి, పి.వినాయకరావు, సిహెచ్.రామలింగేశ్వరరావు, టి.రఘునాగమల్లీశ్వరి, తదితరులు పాల్గొన్నారు.